మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పుట్టినిల్లు సిద్దిపేట

సిద్దిపేట, మే 25: ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పుట్టినిల్లు సిద్దిపేట.. ఏ కార్యం తలపెట్టినా సిద్దించే నేల సిద్దిపేట.. సిద్దిపేట ప్రసిద్ధి పేట అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం కోమటి చెరువులో హనుమాన్ తెప్పోత్సవంలో శ్రీదుర్గాప్రసాద్ స్వామిజీతో కలిసి ఆయన పాల్గొన్నారు. స్వామిజీ అందరినీ ఆశీర్వించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఆరేండ్లుగా ఉత్సవం చేసుకుంటున్నామన్నారు. హనుమాన్ దీక్షకు, సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందన్నారు. ఇంత ఎండలున్నా కోమటి చెరువు మత్తడి దుంకుతుందన్నారు. స్వచ్ఛమైన కాళేశ్వర జలాలు ఏడాది పాటు మనకు అందాయన్నారు. తెప్పోత్సవం అంటే ఒకప్పుడు రాజ మండ్రికి వెళ్లేవారమని, నేడు మన రాష్ట్రంలో సిద్దిపేటలో జరుగుతుండడం సంతోషకరమన్నారు. సిద్దిపేటలో వేడుక ఆరో ఏట జరుపుకోవడం సంతోషంగా ఉందని దుర్గాప్రసాద్ స్వామిజీ అన్నారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

విత్తనాల కోసం రైతుల పడిగాపులు

మిరుదొడ్డిలో జీలుగ విత్తనాల కోసం బారులు దీరిన రైతులు

మిరుదొడ్డి, మే 25: కాంగ్రెస్ ప్రభుత్వంలో విత్తనాల కోసం రైతులకు తిప్పలు మొదలయ్యాయి. శనివారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ఉదయం 7 గంటల నుం చే జీలుగ విత్తనాల కోసం పలు గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద బారులుదీరారు. ప్రభుత్వం 80 బస్తాలు మాత్రమే పంపిణీ చేయడంతో రైతులు పడరానిపాట్లు పడ్డారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ... వానకాలం దగ్గరలో ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి జీలుగ విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు.

మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

హుస్నాబాద్‌రూరల్/ అక్కన్నపేట మే 25: రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తద్వారా దిగుబడులు అధికంగా ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ అన్నారు. శనివారం అక్కన్నపేట మండలం గొల్లకుంట, రేగొండ, జనగామ గ్రామాల్లో పత్తి, వరి విత్తన కొనుగోళ్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్‌లో ఏఈవో ప్రణీత ఆధ్వర్యంలో విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ డివిజనల్ అధికారి మహేశ్, ఏఈవోలు సబిహా, శ్రీలత, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బందారం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక పనుల పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

నాణ్యతతో పనులు చేయాలి

కొండపాక(కుకునూరుపల్లి), మే 25: కొండపాక మండలం బందారం ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను శనివారం కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యతతో పనులు చేయాలని అమ్మ కమిటీ ఏజెన్సీకి సూచించడంతో పాటు పలు సూచనలు చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పనులన్నీ పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈ, ఏఈ, ఎంపీడీవో, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

గజ్వేల్, మే 25: పంటలసాగు కోసం రైతులు నాణ్యతా ప్రమాణాలు కలిగిన విత్తనాలనే కొనుగోలు చేయాలని ఏడీఏ బాబు నాయక్ తెలిపారు. శనివారం మండలంలోని కొడకండ్ల, శ్రీగిరిపల్లి గ్రామాల్లో రైతులకు విత్తన కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూజుగా ఉన్న విత్తన ప్యాకెట్‌లోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్, బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని, విత్తన ప్యాకెట్ తయారైన తేదీ కాలం ముగిసే తేదీలను సరి చూసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్‌పై 'జీఈఏసీ' నెంబర్‌ను చూసుకోవాలని, గ్రామాల్లో విత్తన ప్యాకెట్లను ఎక్కువ ధరకు అమ్మితే వెంటనే మండల వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏవో నాగరాజు, ఏఈవోలు గణేశ్, నర్సింహులు రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

జగదేవ్‌పూర్, మే 25: రైతులు వానకాలంలో సాగు చేసే పంటల కోసం విత్తన కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వసంతరావు తెలిపారు. శనివారం మండలంలోని మందాపూర్‌లో రైతులకు విత్తన కొనుగోలుపై అవగాహన కల్పించారు. అదే విధంగా మండలంలోని నిర్మల్ నగర్, అలీరాజ్‌పేట, బీజీ వెంకటాపూర్, మునిగడప, గొల్లపల్లి, కొండపూర్, బస్వాపూర్, ఎల్లాయిగూడ, వట్టిపల్లి, చాట్లపల్లి గ్రామాల్లో ఏఈవోలు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఏఈవోలు ఖలీల్, శరణ్య, భాను, కృష్ణమూర్తి, కిరణ్, సమత పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే 25: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మద్దూరు వ్యవసాయ శాఖ అధికారి బూరెల రామకృష్ణ అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని లద్నూర్‌లో విత్తనాలు కొనే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు తీసుకోవాలన్నారు. విత్తనాలు తీసుకున్న తర్వాత తప్పకుండా రసీదు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో అఖిల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొండపాక(కుకునూరుపల్లి), మే 25: విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో ప్రియదర్శిని అన్నారు. కొండపాకలో విత్తనాలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. లూజుగా ఉన్న సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు.

నకిలీ విత్తనాలపై నజర్ పెట్టాలి

వర్గల్, మే 25: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వర్గల్ వ్యవసాయాధికారి శేషశయన అన్నారు. మండలంలోని మీనాజీపేటలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా క్లస్టర్ల వ్యవసాయ సహాయ అధికారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

హుస్నాబాద్, మే 25: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ హెచ్చరించారు. హుస్నాబాద్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. విక్రయాల వివరాలను మండల వ్యవసాయాధికారి లేదా, విస్తరణ అధికారి తనిఖీ చేసి సదరు వివరాలను జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మహేశ్, ఏవో నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

నారాయణరావుపేట, మే 25 : మండలంలోని గోపూలాపూర్, గుర్రాలగొంది, కోదండరావుపల్లి గ్రామాల్లో విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏవో రమణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు నాగార్జున, మౌనిక, సంధ్య పాల్గొన్నారు.

పట్టభద్రుల ఆశాకిరణం రాకేశ్‌రెడ్డి



చేర్యాల: నాగపురిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు



మద్దూరు(ధూళిమిట్ట): మర్మాములలో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న మేక సంతోష్‌కుమార్

చేర్యాల, మే 25 : మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్‌ను శాసన మండలిలో పట్టభద్రుల తరపున ప్రశ్నించి న్యాయం చేసేందుకు గ్రాడ్యుయెట్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటును బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి వేయాలని ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలు యాదవ్, గదరాజు చందు కోరారు. శనివారం మండలంలోని నాగపురి, ముస్త్యాల, పోతిరెడ్డిపల్లి గ్రామాలతో పాటు వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి, పట్టభద్రులను ఓటు అభ్యర్థించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి రాకేశ్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు బండమీది కరుణాకర్, అడ్వకేట్ సురేందర్, సత్యం, మేరిండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును గెలిపిద్దాం

కొమురవెల్లి, మే 25: వరంగల్- నల్లగొండ- ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతును గెలిపిద్దామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తలారి కిషన్, బుడిగె రమేశ్‌గౌడ్, మకిలి కనకయ్య, బచ్చల పరశురాములు కోరారు. శనివారం మండలంలోని మర్రిముచ్చాల, గురువన్నపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఇంటికి వెళ్లి అభ్యర్థించారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

మద్దూరు(ధూళిమిట్ట), మే25: మద్దూరు మండలంలోని మర్రాములలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం ఆధ్వర్యంలో శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు కమలాయపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి, పట్టభద్రులను ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సుందరగిరి స్రవంతిపరశురాములు, బొల్లు కృష్ణవేణీచంద్రమౌళి, పీఏసీఎస్ డైరెక్టర్ ఉత్కం మల్లేశం, నాయకులు మంద సుమన్, పీవీ నర్సింహారెడ్డి, కూరెళ్ల భిక్షపతి, మాజీ సర్పంచ్ ఓరుగంటి అంజయ్య, కొమురవెల్లి ఆలయ మాజీ డైరెక్టర్ వజ్రోజు శంకరాచారి, గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొమురవెల్లి: గురువన్నపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజీయే రాజమార్గం

సిద్దిపేట టౌన్,మే 25: క్షణికావేశంలో చేపిన తప్పులను రాజమార్గం ద్వారా రాజీ కుదుర్చుకొని డబ్బు, సమయం ఆదాచేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 8న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం కోర్టు సమావేశం మందిరంలో పోలీస్ అధికారులు, పీపీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జి చందన, సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, సీఐలు లక్ష్మీబాబు, ఉపేందర్, రామకృష్ణ, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తిచేయాలి

సిద్దిపేట అర్బన్: యూనిఫామ్‌లు కుట్టే వారితో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్/నంగునూరు, మే 25 : పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేలా వేగంగా కుట్టడం పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు కుడుతున్న సెంటర్‌ను డీఆర్డీవో పీడీ జయదేవ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు నంగునూరు మండలం తిమ్మాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపటాల్సిన పాఠశాలల భవనాలు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీల మైనర్ మరమ్మతుల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ సెక్రోరియల్ అధికారి రామస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

యూనిఫామ్‌లను త్వరగా అందజేయాలి

గజ్వేల్, మే 25: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లను అందించే విధంగా కుట్టు పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య సూచించారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశానుసారం శనివారం పట్టణంలోని మంజీరా దీపిక స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించారు. దుబ్బాక, దౌల్తాబాద్, తొగుట మండలాలకు సంబంధించిన యూనిఫామ్‌లను గజ్వేల్‌లో కుడుతుండగా నిర్వాహకుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ పట్టణానికి సంబంధించిన యూనిఫామ్‌ల టార్గెట్ ఎంత వరకు పూర్తి చేశారో ఆర్‌పీలను అడిగి తెలుసుకున్నారు.

5వతేదీలోగా అందించాలి

హుస్నాబాద్‌టౌన్, మే 25: హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ విద్యార్థులకు సంబంధించి యూనిఫామ్‌లను జూన్ 5వతేదీలోగా అందజేయాలని యూనిఫామ్స్ తయారీదారులకు మెప్మా పీడీ హన్మంతరెడ్డి సూచించారు. హుస్నాబాద్‌లోని ఆంజనేయ స్లమ్ సమాఖ్య కుట్టుమిషన్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఏడీఎంసీ సంతోషి, మెప్మా కోఆర్డినేటర్ ముత్యాల రాజు, పోలోజు శ్రీలత పాల్గొన్నారు.

వరదరాజస్వామి రథోత్సవం

మర్కూక్, మే 25: మండలంలోని వరదరాజ్‌పూర్‌లో అత్యంత ప్రసిద్ధిగాంచిన వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులు కొనసాగుతున్నాయి. శనివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా వరదరాజస్వామి సతీసమేతంగా సర్వలంకార శోభితులై విశేష పూజను స్వామి వారు అందుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు రాగా, హైదరాబాద్‌కు చెందిన ఆనంద్, పద్మజ, సాయికిరణ్ మహాప్రసాదం అందజేశారు. స్వామివారిని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, నీలం మధు, ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మరామచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి దర్శించుకున్నారు.

ఘరానా దొంగ రిమాండ్

సిద్దిపేట టౌన్, మే 25: వివిధ జిల్లాలో దొంగతనాలకు పాల్పడిన ఘరానా దొంగను సిద్దిపేట పోలీసులు అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి 47 తులాల బంగారం,65 తులాల వెండి ఆభరణాలు, రూ.34వేల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి శనివారం వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా వంతేనపల్లికి చెందిన టేకం రామారావు కొత కాలంగా సిద్దిపేట టూటౌన్, త్రీటౌన్, చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధితో పాటుగా వివిధ జిల్లాలో 24 దొంగతనాలకు పాల్పడ్డాడు. సిద్దిపేట రాజీవ్ రహదారి నర్సాపూర్ కుంకుమ మిల్లు వద్ద సీఐ ఉపేందర్ పోలీస్ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో స్కూటీపై వెళ్తున్న రామారావు పోలీసులను చూసి పారిపోతుండగా అతడిని వెంబడించి పట్టుకున్నామన్నారు. పూర్తి స్థాయిలో విచారించగా వివిధ జిలాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడన్నారు. సమావేశంలో ఏసీసీ మధు, సీఐ ఉపేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు లేక అవస్థలు

సిద్దిపేట రూరల్, మే 25: రైతులను జీలుగ విత్తనాల కొరత వేధిస్తోందని, రైతులు అవస్థలు పడుతున్నారని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా యువజన విభాగం సీనియర్ నాయకుడు మొకిల్ల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వానకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నా రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులోకి తీసుకురాలేదని విమర్శించారు. రైతుల ఇబ్బందులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట రూరల్, అర్బన్ మండలాల్లో జీలుగ విత్తనాల కొరత తీవ్రంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎప్పుడు కావాలన్నా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు.

సిద్దిపేట పట్టణ శివారులోని శివాజీ చౌక్ వద్ద గాలి దుమారానికి కూలిపోయిన టింబర్ డిపో

గాలివాన బీభత్సం

కొండపాక(కుకనూరుపల్లి), మే 25: గాలివాన సృష్టించిన బీభత్సానికి కొండపాక మండలం మధిర గ్రామం ఆరెపల్లిలోని స్వాతి జిన్నింగ్ మిల్లుకు భారీ నష్టం జరిగింది. జిన్నింగ్ మిల్లు యజమానులు జిల్లా శ్రీనివాస్, జిల్లా ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలంలోని ఆరెపల్లిలో సుమారు పదేండ్ల క్రితం జిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేసి పత్తి రైతులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. అనేక మంది కార్మికులు మిల్లు ద్వారా ఉపాధి పొందుతున్నారు. శుక్రవారం రాత్రి వచ్చిన బలమైన గాలివానకు జిన్నింగ్ మిల్లులో నిర్మించిన 40 అడుగుల వెడల్పు, 100 అడుగుల ఎత్తు కలిగిన రేకుల షెడ్డు అమాంతం కూలిపోవడంతో రేకుల షెడ్డు కింద ఉన్న ఖరీదైన మిషనరీలు దెబ్బతిన్నట్లు తెలిపారు. సుమారు రూ.70లక్షలకు పైగా నష్టం జరిగిందని, ప్రస్తుతం మిల్లులో పని లేనందున ప్రాణనష్టం జరుగలేదు. .

సిద్దిపేటలో ..

సిద్దిపేట, మే 25: సిద్దిపేటతో పాటు చుట్టుపక్కల మండలాలు, గ్రామాల్లో శనివారం సాయంత్రం గాలి దుమారంతో కూడిన వర్షం పడింది. సిద్దిపేట పట్టణం, రూరల్ మండలం, నారాయణరావుపేట మండలంలో వీచిన పెనుగాలులు, కురిసిన వర్షానికి తీవ్ర నష్టం జరిగింది. సిద్దిపేట పట్టణంలోని శివాజీనగర్ చౌరస్తాలో సిటీ టింబర్ డిపో గాలి దుమారానికి కొట్టుకుపోయింది. అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు, పెద్ద పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. బాలానగర్‌లో చెట్టు కూలిపోగా ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జనజీవనం స్తంభించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కొండపాక(కుకనూరుపల్లి): గాలివానకు కుప్పకూలిన రేకులషెడ్డు

పలు గ్రామాల్లో గాలివాన

సిద్దిపేటరూరల్, మే 25: సిద్దిపేట రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి గాలి వానకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పల్లుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

సిద్దిపేట రూరల్: పెద్దలింగారెడ్డిపల్లి వద్ద గాలివానకు కూలిన హరితహారం చెట్లు

నూతన కమిటీ ఎన్నిక

హుస్నాబాద్‌టౌన్, మే 25: హుస్నాబాద్ పట్టణంలోని గోదాంగడ్డ హనుమాన్ ఆలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా సంపత్, ఉపాధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా శ్రీనివాస్, సభ్యులుగా సందీప్, మల్లేశం, రాజు, వేణు, తిరుపతి, రాజు, శ్రీనివాస్, శ్రీశైలం, ప్రశాంత్, తిప్పట్ల లక్ష్మి, నీలం తిరుపతిరెడ్డి, బూరుగు కృష్ణస్వామి ఎన్నికయ్యారు.

పోలింగ్ సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్

సిద్దిపేట అర్బన్, మే 25: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మను చౌదరి ఎన్నికల అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, ధూల్‌మిట్ట, మద్దూరు మండలాల్లో ఈనెల 27వ తేదీన జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, అదర్ పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు బ్యాలెట్ బాక్స్‌లను ఉపయోగించడం జరుగుతుందని.. పోలింగ్ ప్రారంభించే ముందు పోలింగ్ ఏజెంట్లకు ఖాళీ బ్యాలెట్ బాక్స్‌లు చూపించి ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఓటింగ్ విధానంపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున ఓటర్లు బ్యాలెట్ పేపర్‌ను చూసేందుకు సమయాన్ని ఇవ్వాలన్నారు. కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, ధూల్‌మిట్ట మండలాల్లో మొత్తం 4,659 మంది పట్టభద్రులు ఉన్నారన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ద్వారా ఎన్నికల అధికారులు బ్యాలెట్ బాక్సులు, పేపర్లను పోలీస్ బందోబస్తు మధ్య ఆయా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

అన్నిరకాల పరీక్షలు చేయాలి

వర్గల్, మే 25: మండల కేంద్రంలోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యురాలు హరిత ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి అన్ని రకాల పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఏవో రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల లెక్క చెప్పాలి

సిద్దిపేట, మే 25: గడిచిన ఎనిమిదేండ్లలో సిద్దిపేట క్రికెట్ స్టేడియానికి ఎన్ని నిధులు కేటాయించారో లెక్క చెప్పాలని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ డిమాండ్ చేశారు. శనివారం క్రికెట్ స్టేడియానికి కేటాయించిన నిధుల వివరాలను సమాచార హక్కు చట్టం కింద వెల్లడించాలని డీవైఎస్‌వోకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో మల్లికార్జున్ వినతిపత్రాన్ని డీవైఎస్‌వో కుర్చీకి ఇచ్చారు. అనంతరం ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. 33 అంశాలకు సంబంధించి వివరాలు ఇవ్వాలని కోరారు.

డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం

గజ్వేల్, మే 25: గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని డంపింగ్‌యార్డులో ప్రమాదవశాత్తు శనివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. డంపింగ్